# నేను బ్రతకాలి

- యం. ఆర్. గురజాల

వెంకట్రావుకు వుద్యోగం లేదు.

ఆ మాటకొస్తే ఎంతో మంది వెంకట్రావులకు ఈ దేశంలో వుద్యోగాలు లేవు.

* * *

ఈ దేశంలో వుద్యోగం లేక పోవడానికి కారణం—మనిషి సోమరి కానవసరం లేదు. విద్యార్హతలు లేవేమో అనుకోవడానికి వీల్లేదు.

విద్యార్హతలుండీ, పని చేయగల సామర్థ్యం, వుత్సాహం వుండీ కూడా ఎంతోమందికి, ఎన్నో కోట్ల మందికి నేడీ దేశంలో వుద్యోగాలు లేవు.

* * *

అన్ని కోట్లమందిలో వెంకట్రావు ఒకడు. అతడు డిగ్రీ హోల్డరు. చదువుకునే రోజుల్లో ఆటల్లో పాటల్లో గడించిన యోగ్యతా పత్రాలున్నాయతనికి. అతని ప్రవర్తన మంచిదనీ, కుర్రాడు చలాకి ఐన వాడనీ అతనికి కాలేజీ ప్రిన్సిపాలిచ్చిన సర్టిఫికెట్టు కూడా వుంది.

కాబట్టే అతడు నిరుద్యోగి.

* * *

డిగ్రీ సంపాయించడానికి అతడు చాలా కష్టపడ్డాడు. రాత్రీ పగలు ఒకటిచేసి కృషిచేసి ఫస్టుక్లాసు సంపాయించాడు. ఆ రోజున, తాను ఫస్టుక్లాసులో పాసయిన రోజున నిజంగా తన్ను తాను ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన టెన్సింగులా భావించాడు మొట్ట మొదటిసారిగా చంద్రమండలం మీద కాలుమోపిన ఆర్మ్‌స్ట్రాంగ్ లా ఫీలయ్యాడు.

ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు.

వుద్యోగం కోసం అతడు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అలాగని అతడు తక్కువ ప్రయత్నాలేం చేయలేదు. భట్టి విక్రమార్కుల కథలో విక్రమార్కుని లా పట్టువదలకుండా—ప్రతి ఇంటర్వ్యూలో శవం (శవాలు)

అడిగిన ప్రతి ప్రశ్నకూ తడుముకోకుండా జవాబులిచ్చీ- ఇచ్చీ....

ఆ తర్వాత చిరాకొచ్చి జవాబులు తెలిసీ ఇవ్వకపోయినందు వల్ల అతని తల వేయి ప్రక్కలయింది. వెంకట్రావుకు వుద్యోగం దొరకలేదు.

* * *

వెంకట్రావుకు రక్తం పంచిచ్చిన తల్లి వుంది. రక్తం పంచుకుని పుట్టిన అన్నయ్య వున్నాడు. అన్నయ్య జీవితం సగం పంచేసుకున్న వదిన వుంది.

అతని చిన్నప్పుడే తండ్రి చచ్చిపోయాడు. తండ్రి లాంటి వారెవరూ అతనికి లేరు. తండ్రి వదిలిపోయిన తరగని ఆస్తి అనేది లేదు. అందుకే అతనికి వుద్యోగం దొరకలేదు.

వుద్యోగం దొరక్కపోవడం వల్ల వెంకట్రావుకు చాల బాధగా



కథా నిలయం

వుంది—తన ప్రయోజకత్వం నిరూపించుకునే అవకాశం లేదని.

అతని తల్లికి బాధగా వుంది- కొడుకుని పెద్ద వుద్యోగంలో చూసుకోవాలని తను కన్న కలలు ఫలించలేదని.

అతని అన్నకు ఇంకా బాధగా వుంది—తన బాధ్యతలు అతడు సగం పంచుకోలేదని.

వదినకు అంతకంటే బాధగా వుంది—చదువుల పేరుతో అప్పులకూ, వడ్డీలకూ పోయిన సొంత ఇంటితోబాటే రేపు తన పిల్లల భవిష్యత్తు పోతుందని.

అవును మరి-ఇంటి యజమాని కంటే ఇల్లాలికే భవిష్యత్తు గురించి ఎక్కువ బెంగ. పనీ పాటూ లేనివాళ్ళని ఇలా పోషించు కుంటూ పోతే రేపు తన పిల్లల కేం మిగలదని పాపం ఆ ఇల్లాలి బాధ. ఆమెను దృష్టిలో వుంచు కుంటే ఆమె సమంజసంగానే ఆలోచిస్తోందనిపిస్తుంది. మరి వెంకట్రావుకు వుద్యోగం లేదుగా!

* * *

ఈ మధ్య వెంకట్రావు పరిస్థితి మరీ దైన్యంగా వుంటోంది. తొక్కిన గడపనే తొంభయి తొమ్మిది సార్లు తొక్కాడు. అడిగిన నోటితోనే, అడిగిన మనిషినే మళ్ళీ మళ్ళీ అడిగాడు. డిగ్రీ పత్రాన్ని చూపాడు. తన కున్న యోగ్యతలన్నీ ఏకరువు పెట్టాడు. ఆత్మాభిమానాన్ని మర్చి పోయి ఈసడించిన వార్ని కూడా ప్రాధేయపడ్డాడు.

కానీ, అతనికి వుద్యోగం ఎవరూ ఇవ్వలేదు. వదినగారి సూటిపోటి మాటలకు వుడికి పోతున్నాడు. అమ్మ మౌనవేదనకు తల్లడిల్లిపోతున్నాడు. అన్నగారికి ముఖం చూపలేక పోతున్నాడు.

రోడ్డున పోతూంటే అడిగిన మనిషే అరవై ఆరు సార్లు, "ఏర్రా అబ్బాయ్! నీకు ఉజ్జోగం వొచ్చిందా?"అని అడుగుతోంటే వంచిన తల ఎత్తలేక పోతున్నాడు.

అడిగిన ప్రతివాడూ—"అం ఈ రోజుల్లో వుజ్జోగాలకోసం చూస్తే వెంట్రుకలు నెరిసి పోతాయి" అని పెదవి విరు స్తోంటే—నైరాశ్యంలో కూరుకు పోతున్నాడు.

అతనికి తెలీదు-ఈ దౌర్భాగ్యం అతనిది కాదు, ఈ దేశానిదేనని.

అతనికి తెలీదు-ఈ అపరాధం అతనిదెంతమాత్రం కాదు, ఈ దేశాధినేతలదేనని.

అతడు సామాన్యుడు. కోట్లాది సామాన్యుల్లాగే అతనికీ వుద్యోగం దొరకదు.

*  *  *

వెంకట్రావు రోడ్డంట పోతూ ఆలోచిస్తున్నాడు. వెంకట్రావు ఆలోచిస్తూ రోడ్డంట పోతున్నాడు.

అతడు రోడ్డంట ఆలోచిస్తూ పోతూ, పోతూ ఆలోచిస్తూ ఓ నిర్ణయాని కొచ్చేశాడు. నేటి యువ తరానికి దుందుడుకుతనమే తప్ప నిర్ణయించే శక్తి లేదన్న అపవాదు నుండి యువలోకాన్ని తప్పించాలి.

మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు. రోడ్డంట పోతూనే వున్నాడు. అతని ఆలోచన తన నిర్ణయాన్ని ఎలా క్రియారూపంలో పెట్టాలని.

ఆలోచన తెగటం లేదు. నిర్ణయం క్రియారూపం దాల్చటం లేదు.

రోడ్డుమీద ఆలోచిస్తూ పోతూ అతడు గమనించలేదు-తన ముందో బస్సు దూసుకు వస్తోందని. కొన్ని క్షణాల్లో అది అతనిమీద దూసుకు పోయేదే, అతన్ని తనక్రింద వేసుకుపోయేదే

అది "తంబుగారి విశాఖ పట్టణం సిటీ బస్సాసురుడు" కాదు గనక, కొద్దిలో వెంకట్రావుకి ప్రాణ గండం తప్పింది. తన ప్రక్కనే 'బొయ్‌య్‌న' హార్ని చ్చేసరికి వులిక్కిపడి ఆలోచనల్లోంచి ఈ లోకంలోకి వచ్చాడు—వొచ్చి వులిక్కిపడ్డాడు.

కిటికీ లోంచి బుర్ర ఇవతలికి పెట్టి ఆ శకట చోదకుడు (డ్రైవరు) తన మొహాన్ని సాధ్యమయినంత వికారంగా పెట్టి- "క్యాబే! నువ్వు చచ్చి మమ్మల్నెందుకు చంపుతావు? నీకంత చావాలనుంటే ఎల్లి రైలింజను క్రింద దూకి చావరాదూ?" అనడం విన్నాడు వెంకట్రావు రెండు చెవులతోనూ.

విని ఆలోచనల వరదలో కొట్టుకు పోతూన్న అతనికి ఆధారంగా ఓ గడ్డిపరక దొరికినట్లయి అతని ముఖం సీసాలో ఆఖరి సారాచుక్క త్రాగిన త్రాగుబోతు ముఖంలా విప్పారింది. విప్పారి ఆ చోదకునికి కృతజ్ఞతలు మనసులోనే చెప్పుకుని, రైలుస్టేషన్ వైపు నడిచాడు- చచ్చిపోదామని. అదే అతను చేసుకున్న నిర్ణయం. ఎందుకంటే అతనికి ఉద్యోగం దొరకలేదు!

*  *  *

నిర్ణయం ముందే చేసుకున్నాడు గనక దాన్ని క్రియారూపంలో పెట్ట

డానికి చకచకా పోతున్నాడు.

చకచకా పోతూ, ఎలక్షన్లప్పుడు గోడల మీద రాసిన రాతల్ని- అవి ఖాళీరాతలు గాదు, భారత ప్రజల నుదుటి రాతలన్నట్లుగా చూస్తూ—

"నిరుద్యోగాన్ని ముప్ఫయి ఏళ్ళుగా పోషించింది కాంగ్రెస్సు"- "స్వేచ్ఛ కావాలా? తిండి కావాలా?" చదువుతూ పోతున్నాడు.

ఎలక్షన్లయి రెండేళ్ళు కావస్తున్నా అవింకా చెరగిపోలేదు- అవి భారతీయుల నుదిటి రాతలు.

రైలు స్టేషన్‌కి కొద్ది దూరంలో పట్టాల ప్రక్కనే తన భాగ్యదేవత కోసం ఎదురు చూస్తున్నట్లుగా- రైలు కోసం అసహనంగా నిరీక్షిస్తున్నాడు.

వేకన్సీలు అతనికి దూరంగా తప్పుకున్నా, రైలు మాత్రం అతని నిరీక్షణకి సంతసించి తహ తహమంటూ (లాడుతూ) దూసుకుంటూ వస్తోంది, పట్టాల్ని మేసుకుంటూ వస్తోంది.

వెంకట్రావు కాళ్ళు వణుకుతున్నాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. రక్తం ధనాధనా తల్లోకి తన్నుతోంది.

వదిన ఈసడింపులు, అమ్మ వేదన, అన్నయ్య నిర్లక్ష్యం, ఇరుగు పొరుగుల పెదవి విరుపులు అన్నీ మర్చిపోయాడు కొన్ని క్షణాలు.

అతని ఆలోచన్లు స్తంభించాయి. మరుక్షణం రైలింజను అతన్ని చుంబించేదే!

భయంకరమయిన ఆక్రందన! చిందర వందరైన మాంసం ముక్కలు! చుట్టూ విరజిమ్మిన రక్తం చుక్కలు! మృత్యువు ప్రత్యక్ష రాసక్రీడ! శవం తాలూకు తల ఎగిరి దూరంగా పడింది!

కీచు మంటూ ఆగిపోయింది రైలు.

రైలు దిగి గార్డూ, ప్లాట్‌ఫారం దిగి స్టేషను మాస్టరూ పరివార సమేతంగా ఆదరా బాదరా పరుగెట్టుకొచ్చారు. మూగిన జనం కేకలు, కూకలు.

"ప్లాట్‌ఫారానికి దూరంగా ఈ సంఘటన జరిగింది కాబట్టి ఇది అనుమానంలేకుండా ఆత్మహత్యే." రాజకీయ నాయకుడిలా ఓ ప్రకటన జారీ చేశాడు స్టేషన్ మాస్టర్. గార్డు వూకొట్టి తప్పుకున్నాడు. తప్పుకుని వూ కొట్టాడు. దీనితో నాకేం నిమిత్తం లేదని చలిమంట కాగుతూ నుంచొంది రైలింజను.

సహజంగా చచ్చిపోతే వాడి కళ్ళు దోపిళ్ళు. ఆత్మహత్య చేసు

కుంటే- వాడి చావు నలుగురి నోట్లో కావు-కావు.

చుట్టూ పోగయిన జనం నానా రకాల మాటలనుకుంటున్నారు.

పిరికి వెధవన్నారు. స్వజనులకి ద్రోహం చేసేడన్నారు.

పాపం- అతనికీ వుద్యోగం దొరికి వుండదు.

*   *   *

వెంకట్రావు ఇదంతా వింటున్నాడు. చచ్చిపోయింది అతడు కాదు. అతనిలాంటి మరో సామాన్యుడు, దౌర్భాగ్యుడు. వెంకట్రావు దూకుదామనేసరికే—ఈ సంఘటన జరిగిపోయింది.

చనిపోదామనొచ్చి - మృత్యువు భయంకర రూపాన్ని చూశాడు. చనిపోయినవాడ్ని గురించి జనం అడిన నిందలు విన్నాడు. తాను చనిపోయివుంటే తన్నీ అంతే అనేవారు.

అంతే! అతని ఆలోచనా ధోరణి మారిపోయింది.అతనిప్పుడు చనిపోడు. తను పిరికి వెధవకాడు. తన వాళ్ళకి ద్రోహం చేయడు.

వెనుదిరిగి ఇంటికి బయలుదేరాడు. అతని ఆలోచనలు ఇంతవరకూ అతడు స్పృశించని దిశలో సాగుతున్నాయి.

తనకు ఇంకొకరు వుద్యోగం ఇవ్వక్కర్లేదు. తన వుద్యోగాన్ని తానే కల్పించుకోగలడు.

ఆ రిక్షా తొక్కుతున్న మనిషీ, బూట్‌పాలిష్ చేస్తూన్న ఆ చిన్న కుర్రాడూ, ప్రక్కనే గోడలకు ఎల్లవేస్తున్న ఆ మధ్య వయస్కురాలూ—వీళ్ళంతా తానింతదాకా స్పృజించని శ్రమజీవన సౌభాగ్యాన్నీ, ఆ సౌభాగ్యంలోని సంతృప్తినీ ఉపదేశిస్తున్నారు.

వెంకట్రావుకు నడి బజార్లో జ్ఞానోదయమయింది.

బోధివృక్షం క్రింద మహా జ్ఞానం పొందినప్పటి సిద్ధార్థుని వదనంలా అతని ముఖంలో కోటి ఆశా రేఖలు వెలుగుతున్నాయి.

ఇప్పుడు అతనికి ఉద్యోగం అవసరం లేదు.

*   *   *

నడి రోడ్డంట వెంకట్రావు భవిష్యత్తు గురించి ఆశాలోచనల్లో నిమగ్నమై, సునీల్‌దత్ సినిమా ('దరిందా')లో అతని యోగమాయచేత ఆవహించబడ్డ మని

షిలా పోతున్నాడు. అతనికి తన ఆలోచనలు తప్ప వేరే ధ్యాసలేదు.

చిన్న కార్లూ, సైకిల్ రిక్షాలూ అతన్ని తప్పించుకుపోతున్నాయి. అతను మాత్రం తప్పుకోడం లేదు. అతనీలోకంలో లేడు.

అతనికెదురుగా ఓ బస్సు రయ్ మని వస్తోంది. అది విశాఖపట్టణం పిటీ బస్సు కాదుగానీ, దాని చోద కుడు మొరార్జీదేశాయ్‌కి వారసుడు మాత్రం కాదు. అంచేత ముక్కుల దాకా తాగేశాడు. తాగేసి బస్సు నడుపుతున్నాడు. నడుపుతూకూడా తాగేస్తున్నాడు.

అతడేబస్సును నడుపుతున్నాడో బస్సే అతన్ని నడుపుతుందో తెలీదు గానీ, అతడికి మాత్రం రోడ్డుమీద వారంతా చీమల్లా కన్పిస్తున్నారు.

అతడు బస్సును తోలేస్తు న్నాడు. అతడు రోడ్డును తోలొలి సేస్తున్నాడు.

వెంకట్రావు ఇదేమీ గమనించ లేదు. అలాగే పోతున్నాడు. అతడు ప్రక్కకి తప్పుకోలేదు. తన కెదు రుగా వస్తోంది బస్సుగాదు, అదేదో గంగిగోవన్నట్లు. జనం అరిచారు. కాని ప్రయోజనం లేకపోయింది.

'ఢన్‌న్!' పెద్దగా ధ్వని.

"అమ్మమ్మా!" వెంకట్రావు పెద్దగా అరిచాడు. రక్తం మడు గులో తన్నుకుంటున్నాడు.

బస్ సడన్ బ్రేక్‌తో ఆగి పోయింది. అందులో వున్న ప్రయాణీకులకి కొందరికి ముందరి పళ్ళు విరిగాయి. కొందరికి నొసళ్ళు చిట్లాయి. వాళ్ళు తేరుకుని ఖాళీగా వున్న డ్రైవరు సీటును చూసి ఈ బస్సును ఇంతదాకా డ్రైవరు నడప లేదేమో నన్న అయో మయంలో పడిపోయారు!

జనం పోగయ్యారు. రక్తం వరదలో ఆఖరి శ్వాస పీలుస్తున్న వెంకట్రావు నోటిలో ఎవరో నీళ్ళు తెచ్చి పోస్తున్నారు.

"నేను బ్రతకాలి...నే....ను... చా....వ ... కూడ...దు... బ్రత కాలి..." అతని గొంతుగుడు పైకి విన్పించడం లేదు. పెదాలు కదు లుతున్నాయి. కొన్ని క్షణాలకి అదీ ఆగిపోయింది. హృదయ చలనం నిలిచిపోయింది. జీవితం అతన్ని మోసం చేసింది.

అతనికిక ఉద్యోగం అక్కర లేదు.

*